# దోషి

ఆదివారం ఉదయం తొమ్మిదయి ఉంటుంది. వరండాలో కూర్చుని దినపత్రికలోని వార్తలు చదువుతున్నాను. చల్లటి ఎండ నేనున్న మడతకుర్చీ వరకు వచ్చి ఆగింది. ఒక్క ఆదివారమే ఏ పని చేయకుండా గడుపుతాను. అత్యవసరమయితే తప్ప ఎక్కడికో వెళ్లను. ఫోన్లు కూడా తీసుకోను. నా భార్య కాని, పిల్లలు కాని నాకు వచ్చే కాల్స్ తీసుకుంటారు. ఆ రోజు మటుకు నా విశ్రాంతికి ఎవరూ భంగం కలిగించరు. నేను ఇంట్లో ఉన్న లేననే చెబుతారు. ఎవరినీ చూడను.

ఆ ఉదయం మటుకు తప్పించుకోలేక పోయాను. నా బంగళా బయట కారు ఆగిన చప్పుడయింది. నేను కూర్చున్నచోట నుండి కారు నాకు కనిపిస్తోంది. ఆ కారును అక్కడి నుండి తీసేయమని వాచ్‌మేన్ అరుస్తున్నాడు. కారు ముందుకు వెళ్ళి ఆగినట్టుంది. ఎవరో దిగి నట్టుంది. తలుపు మూసిన శబ్దమయింది.

కారు దిగింది ఆమే అనుకుంటాను, వాచ్‌మేన్ దగ్గరకు వచ్చి ఏదో అడుగుతోంది. వరండాకు గేటు అట్టే దూరంలో లేదు కాని మాటలు వినబడడం లేదు. ఆమెకు ముప్పయి అయిదు సంవత్సరాలుండొచ్చు. ఎర్రగా, సన్నగా ఉంది. వేసుకున్న సల్వార్ కుర్తా ఆమె వంటికి వదులుగా ఉన్నాయి. చదువుకున్న వ్యక్తి లానే కనిపిస్తోంది. ఆమె నన్ను కలవాలని వాచ్‌మేన్‌ను అడుగుతోందనుకుంటాను. అతను ఒప్పుకోవడం లేదు. ఆ సమయంలో ఆమె రావడం నాకు ఇష్టంగా లేదు. కాకపోతే ఆమెను ఎక్కడో చూశాను. పరిచయం ఉన్న వ్యక్తే. ఎక్కడ చూశానో గుర్తు రావడం లేదు. వాచ్‌మేన్ చేతిలో విజిటింగ్‌కార్డు పెట్టి చేతులు జోడించి బతిమలాడుతోంది. కన్నీళ్లు పెట్టుకుంటోందో, ఏమో? చాలామంది కన్నీళ్లలో నిజం ఏమాత్రం ఉండదు. నటన నిజంకన్నా నిజంగా ఉన్నట్టు అనిపిస్తుంటుంది.

వాచ్‌మన్‌కు ఆమె మాటలకు జాలి కలిగిందో, ఏమో ఆమె కార్డు పట్టుకుని నా దగ్గరకు వస్తోంటే లేచి ఇంట్లోకి వెళ్ళి పోదామనిపించి లేవబోతోంటే అతను నా దగ్గరకు వచ్చి భయపడుతూ తను తెచ్చిన కార్డు నాముందుకు చాపాడు. తీసుకున్నాను. అందులో 'జి.భారతి,యం.టెక్' అని ఉంది. చిరునామా కూడా ఉంది. ఉద్యోగ వివరాలేమీ లేవు. "నేను ఎవరినీ చూడదల్చుకో లేదని ఆమెతో చెప్పు" అని కార్డు తిరిగి అతనికి ఇవ్వబోతూ తనపేరు కింద పెన్నుతో రాసిన దాన్నిచూసి ఆగాను. 'డాటర్ ఆఫ్ జస్టిస్ జి. కృష్ణారావు' అని ఉంది. కృష్ణారావు గారు నాకు గురువు. నన్నింత వాడిని చేసింది ఆయనే. హైకోర్టుకు చీఫ్‌జస్టిస్ కావలసిన సమయంలో చనిపోయారు భారతి నాకు బాగా తెలుసు.

కుర్చీలోంచి లేచేప్రయత్నం విరమించుకుని, "రమ్మను" అన్నాను.

భారతి మెట్లు ఎక్కి వరండా మీదకొచ్చింది. ఆమెను పదేళ్ల కిందట పెళ్ళిలో చూశాక మళ్లీ ఇదే చూడడం. అప్పటికీ, ఇప్పటికీ పోల్చుకో లేనంతగా మారిపోయింది. మనిషి ఎముకల పోగులా ఉంది. అప్పుడు ఎంతో అందంగా ఉండేది. ఎందుకిలా అయిపోయింది?

నాకు నమస్కరిస్తోంటే దగ్గరగా ఉన్న కుర్చీచూపించి, "కూర్చోమ్మా" అన్నాను. కూర్చున్నాక, "ఏమిటిలా అయిపోయావు?" అడిగాను.

బాధగా నవ్వింది. కృష్ణారావుగారు చనిపోయిన మూడో సంవత్సరంలో భారతి వాళ్ల అమ్మ కూడా చనిపోయింది.

"మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు నన్ను క్షమించండి. పదంటే పదినిమిషాలు మీతో మాట్లాడి వెళ్లి పోతాను...." నా ముఖంలోకి చూస్తూ ఆగింది.

"చెప్పమ్మా."

"మా పెళ్ళయిన మరుసటి సంవత్సరంలో నాకు బాబు పుట్టాడు. ఇప్పుడు వాడి వయసు తొమ్మిది సంవత్సరాలు. మానసికంగా ఎదగలేదు. నా దగ్గర తప్ప ఎవరి దగ్గరా ఉండడు. తన పనులు ఏవీ తను చేసుకోలేడు. వాడి మాటలు నాకు తప్ప ఎవరికీ అర్థం కావు. రోజులో పదహారు గంటల పాటు పక్కనే నేనుండాలి. నిద్ర చాలా తక్కువగా పోతాడు. అయిదు నిమిషాలు పాటు నేను కనిపించకపోతే నానా యాగీచేస్తాడు. వాడి నాన్న దగ్గరకు కూడా వెళ్ళడు. వాడుపుట్టక ముందునుంచి ఉద్యోగం చేసేదాన్ని. వాడిని ఏ వికలాంగుల కేంద్రంలో ఉంచినా, ఉండకపోతోంటే వాడిని చూసుకోడానికి నేను ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. ఇక్కడ చాలా మంది

డాక్టర్లకు చూపించాం. బెంగుళూరులో చూపించాం. ఢిల్లీ తీసుకువెళ్ళాం. ఏం లాభంలేకపోయింది. ఎన్ని మందులు వాడినా ఉపయోగం లేకపోయింది."

"డాక్టర్లు ఏమన్నారు?"

"వాడు నా కడుపులో ఉన్నప్పుడు వాడికి పడనిమందులేమయినా వేసుకోవడం వలన బిడ్డ అలా పుట్టి ఉంటాడు" అన్నారు. గైనకాలజిస్టు రాసిన మందులు తప్ప వేరేమీ పొరపాటునయినా వేసుకోలేదు. పిల్లవాడంతే. బాగుపడడు. అయిదు సంవత్సరాల కిందట మరోబాబు పుట్టాడు. బిడ్డ కడుపులో పడిన దగ్గరనుండి ఎన్నో జాగ్రత్తలు తీసుకుని, ఎందుకయినా మంచిదని ఒకరు కాదు, ఇద్దరు కాదు, అయిదుగురు డాక్టర్లను సంప్రదించాం. మామూలు కాన్పు అయింది. బిడ్డ ఆరోగ్యంగా పుట్టాడు. మొదటివాడితో నేను పడిన కష్టమంతా మర్చిపోయాను. అయితే నా సంతోషం మూడు సంవత్సరాలకన్నా ఎక్కువ ఉండలేదు. రెండవవాడు కూడా మానసిక వికలాంగే. ఆ సంగతి మూడు సంవత్సరాల తర్వాత కాని బయట పడలేదు. రెండవ వాడిని కూడా డాక్టర్లకు చూపించాం. వ్యాధి ఇదని ఎవరూ నిర్ధారించలేక పోయారు. ఒక్కో డాక్టరు ఒక్కో కారణం చెప్పారు. వెల్లూరు తీసుకెళ్ళి చూపిస్తే జీన్స్ లోపం అయి ఉంటుందన్నారు.

"నా భర్త మంచి ఉద్యోగంలో ఉన్నాడు. వాళ్ళ ఆఫీసుకు దగ్గరగా ప్రభుత్వ మానసిక వికలాంగుల కేంద్రం ఉంది. రెండోవాడు నన్ను వదిలిపెట్టి ఉండగలడు. కొత్తా పాత లేదు. అందరితో కలిసిపోతాడు. ముఖ్యంగా పిల్లలతో. విచారకరమయిన విషయమేమిటంటే నన్నూ నా భర్తను గుర్తుపట్టడు. కొత్త వ్యక్తులను చూసినట్టుగా చూసేవాడు. అదేమాకు బాధగా ఉండేది. కేంద్రంలోని పిల్లలతో మటుకు బాగానే ఆడుకునేవాడు.

"చదువుకునేప్పుడు, పెళ్ళికిముందు, పెళ్ళయిన తర్వాత నా జీవితం గురించి ఎంతో సుందరంగా ఊహించుకున్నాను. అయితే జరుగుతోంది పూర్తి వ్యతిరేకంగా ఉంది. నాలుగయిదు సార్లు ఆత్మహత్య చేసుకుందామని కూడా అనిపించింది. వాళ్లను కన్న నేనే చనిపోతే నా పిల్లల్ని నా అంత ప్రేమగా ఎవరు చూసుకుంటారు? ఆ ఆలోచన మళ్లీ రానీయలేదు. నా భర్త మంచివాడు. అన్ని విషయాల్లో నాకెంతో సహాయంగా ఉంటాడు. ఉదయం ఆఫీసుకు వెళ్తూ రెండోవాడిని తనతో కారులో తీసుకెళ్ళి వికలాంగుల కేంద్రంలో వదిలిపెట్టి సాయంత్రం ఆఫీసు నుండి తిరిగివస్తూ తీసుకొచ్చేవాడు.

"పదినెలల కిందట రెండోవాడిని కారులో నా భర్త తనతో తీసుకెళ్ళాడు. సరాసరి ఆఫీసు చేరుకుని పార్కింగ్‌లాట్‌లో కారు పార్క్ చేసి వెనకసీట్లో వాడున్నసంగతి మర్చిపోయి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. సాయంత్రం కారు బయటకు తీస్తున్నప్పుడు కాని వాడిని గమనించలేదు. వాడు అప్పటికే చనిపోయి ఉన్నాడు..." ఆగింది.

భారతి చెప్పడం మొదలుపెట్టినప్పుడే నిరంజన్ కేసు గుర్తువచ్చింది. అతను భారతి భర్త అని ఇప్పుడు తెలుసుకున్నాను. కోర్టులో కూడా ఆమెను ఎప్పుడూ చూడలేదు. చూసినా గుర్తు పట్టి ఉండేవాడిని కాదేమో. అతని కేసు నేనే చూస్తున్నాను. తన అశ్రద్ధ, అజాగ్రత్తల వలన కొడుకు చావుకు కారణమయ్యానని అతనే ఒప్పుకున్నాడు. ప్రాసిక్యూషన్ మటుకు అది అతని అశ్రద్ధ వలన కాని అజాగ్రత్త వలన కాని జరిగింది కాదని మానసిక వికలాంగుడయిన పిల్లవాడిని పెంచలేక ఆవిధంగా హత్యకు నిరంజన్ పాల్పడ్డాడని వాదించింది. వాదోపవాదాలు ముగిశాయి. నేను ఇవ్వవలసిన తీర్పు మిగిలి ఉంది. వారం పదిరోజుల్లో అదీ పూర్తి చేస్తాను.

"ఇంతవరకు ఎవరికీ తెలియని నిజం మీకు చెబుదామని వచ్చాను. ఈ సంగతి నా భర్తకు కూడా చెప్పలేదు. చెప్పలేకపోయాను. మా రెండో వాడంటే అతనికి ఎంతో ఇష్టం. ఈ పని నేను చేసి ఉండాల్సింది కాదు. అంతకుముందు ఎప్పుడూ లేనిది వాడు తోటి పిల్లల్ని ఒహటే కొడుతున్నాడని కేంద్రం నిర్వాహకురాలు నాకు ఫోనుచేసి చెబితే వాడలా చేయకుండా ఉండడానికని వాడు కేంద్రానికి వెళ్ళేప్పుడు వాడికి ఎప్పుడూ ఇచ్చే మందు మోతాదు కొద్దిగా ఎక్కువ ఇచ్చాను. దాంతో నిద్రపట్టే అవకాశం ఉంది. వాడు కొద్దిగా హుషారుగా ఉంటే ఎదురుగా వచ్చే వాహనాలు చూస్తూ కేకలు వేసి చప్పట్లు కొట్టే అలవాటుంది. ఆ రోజు కారు వెనక సీట్లో మత్తుగా ఉండిపోవడంతో వాడిని తను కారులో తీసుకురాలేదని నా భర్త అనుకున్నాడు.... అసలు దోషి.... నా భర్త కాదు.. నేను .... నేనే... " అంది భారతి.

❖ **నవ్య వీక్లీ, 4 ఫిబ్రవరి, 2009**